# స్లిం ఫిగర్

**మిర్రర్**

ఆదివారం.

ఆఫీసుకు సెలవు.

ఆఫీసరు అరుపులు లేవు.

టైపు రైటరు కటకట శబ్దాలు లేవు.

కాలింగ్ బజర్ కీచుగొంతుకలు లేవు.

ఆదివారం అచ్చంగా ఆదివారంలా ఉంది.

మహా బద్ధకంగా ఉంది.

కాస్త బోరుగా కూడా ఉంది.

భోజనంచేసి రోడ్డున పడితే ఏ మార్నింగ్ షో అయినా దొరుకుతుంది. ఆఫీసు ఉన్న రోజులలో టంచనుగా తొమ్మిదిన్నరకి అన్నం పెడుతుంది మా ఆవిడ. కానీ ఆదివారం నాడు హరిహరాదులు దిగి వచ్చినా పన్నెండు కొందే పళ్ళాలు పరచదు.

న్యూస్ పేపర్ చదవటం ఎప్పుడో అయిపోయింది. రేడియోలో ఉదయం ప్రసారం కూడా సమాప్తం అయింది. టైము మహా మందకొడిగా నడుస్తోంది.

సెకండ్ రౌండ్ కాఫీ లాగిస్తే బాగుండునని పించింది.

మా చంటిగాడి ద్వారా "కాఫీ రిక్విజిషన్" పంపించాను.

ఏమీ తోచక మళ్ళీ పేపరు చేతిలోకి తీసుకున్నాను.

ఇంతలో మా ఆవిడ కాఫీ కప్పుతో ప్రత్యక్షం అయింది.

"థాంక్సు సరూ!" అన్నాను.

జవాబు చెప్పటానికి టైము లేదు అన్నట్టుగా గాలిలో చేయి వూపి తిరిగి వంట ఇంటి ప్రవేశం చేసింది.

సన్ డే స్పెషల్స్ ఏవో చేస్తోందన్న మాట— అందుకే అంత బిజీ. ఇప్పుడు మొగుడు కాదుగదా వాడి బాబు పలకరించినా పట్టించుకోదు. వంట ఇంటిని వదిలి రాదు .

కాఫీ ఒక "సిప్" లాగించాను. గొప్ప "కిక్కు" ఇచ్చింది. పెళ్ళికి ముందు "బాగ్ పైపర్"తో దినచర్య ప్రారంభించే వాడిని. కానీ సరోజిని వచ్చిం తర్వాత అన్నిటికీ దూరం అయిపోయాను. ఆవిడ చేతి కాఫీలోనే "కిక్కు" పొందటం నేర్చుకున్నాను.

ఇంతలో గడ్డం గీసుకోవలసిన అవసరం గుర్తు వచ్చింది.

సరంజామా అంతా కిటికీలో పేర్చాను. అసలు కాఫీకి గడ్డానికీ గొప్ప కాంబినేషను. మరొకరి విష యంలో అయితే చెప్పలేను కానీ, నా మట్టుకు నాకు కాఫీ తాగుతూ గడ్డం గీసుకుంటూంటే మహా సరదాగా ఉంటుంది.

బ్రష్‌తో గడ్డానికి సబ్బు రాద్దామని అద్దంలో చూసుకుంటే నా మొహం కనబడలేదు. నేను అందుకు ఆశ్చర్యపోను. ఇది నాకు మామూలే. గడ్డం చేసుకుంటూ నాకు ఇష్టమైన వాళ్ళ గురించి ఇష్టం వచ్చినట్టుగా ఆలోచించుకుంటూ ఉంటాను.

ఇవాళ అద్దంలో మాలతి ముఖం కనపడింది.

మాలతి నా మరదలు కాదు. ప్రియురాలు అంతకంటే కాదు.

మాలతి మా ఆఫీసులోనే 'సి' సెక్షన్‌లో పని చేస్తోంది. ఆమెతో నాకు అసలు పరిచయం లేదు అనే చెప్పాలి. అయినా గత రెండు సంవత్సరాలుగా ఆమెను చూస్తూనే ఉన్నాను. అంతకంటే ఎక్కువగా ఆమె గురించి ఆలోచిస్తూ ఉంటాను.

మాలతి అంతగా నా ఆలోచనల్లో చోటు చేసు కోవటానికి కారణం ఆమె "స్లిమ్ ఫిగర్" కావటమే.

మాలతి సన్నగా, నాజూగ్గా, మెరుపు తీగలా ఉంటుంది. సన్నగా ఉన్నా బలహీనంగా ఉండదు. ఎంతో పుష్టిగా, ఆరోగ్యంగా ఉంటుంది. ఆమె సన్నని నడుము, పొడుగాటి చేతులు, మృదువైన వేళ్ళు, పల్చటి చెక్కిళ్ళు, చురుకుగా చూసే కళ్ళు, గబగబా అడుగులు వేస్తూ ఆమె నడిచే తీరూ నాకు చాలా ఇష్టం.

ఆమె సెలవు పెట్టిన రోజున మరో సన్నటి లేడీని చూడందే మనసుకు తృప్తిగా ఉండదు... దురదృష్టవశాత్తూ మా ఆఫీసులో ఉన్న ఆడవాళ్ళు నలుగురే. అందులో నా "లైకింగ్"కి సరిపోయే మనిషి ఒక్క మాలతి మాత్రమే.

ఆమెను చూడడం కోసం పనిగట్టుకుని ఆమె పనిచేసే " సి సెక్షను" కు కనీసం రోజుకు రెండు సార్లు అయినా వెళతాను. అసలు సి సెక్షనుతో నాకు ఎలాంటి అవసరం పడదు. కొత్తలో వూరికే అలా రెండు రౌండ్లు వేసి వచ్చేవాడిని. కానీ ఎవరైనా "నేను మాలతి కోసం వస్తున్నానని" అనుకుంటా రేమోననే "గిల్టీ కాన్షస్" పెరిగి, ఆ సెక్షనుకు వెళ్ళటానికి ఒక కారణం అంటూ ఏర్పరచుకున్నాను.

సి సెక్షనులోనే పని చేసే సుందరంతో స్నేహం పెంచుకున్నాను. అతనిప్పుడు నాకు బెస్ట్ ఫ్రెండ్.

సుందరంతో మాట్లాడే నెపంతో ఆ సెక్షనుకు వెళ్ళి అతని ప్రక్కన కూర్చుని రోజుకి కనీసం ఒక గంట అయినా గడుపుతాను. ఈ గంట కాలంలో మాలతిని అన్ని వైపుల నుంచీ తనివితీరా చూసి ఆనందిస్తూ ఉంటాను.

అయితే సుందరంతో మాట్లాడేటప్పుడు పొరపాటున కూడా నానుంచి మాలతి ప్రసక్తి రాకుండా జాగ్రత్త పడేవాడిని. అసలు ఆమె పేరు మాలతి అని కూడా తెలియనంతగా ప్రవర్తించే వాడిని. మాలతి ఉనికి కూడా నేను గమనించనట్టుగా సుందరంతో మెలుగుతుంటాను. అయితే సుందరం కూడా కేవలం తన విూదగల స్నేహభావంతోనే అతన్ని చూడడానికి నేను వస్తున్నాను అని భావించే వాడు. అతను అలా భావించేందుకు నేను గొప్పగా నటిస్తుంటాను.

ఈ మధ్య నాకు గొప్ప నటనా శక్తి అలవడింది. నా అవసరం కోసం అవతలి వాడిని "స్లీజు" చేయవలసి వస్తే నేను అద్భుతమైన నటనా చాతుర్యం నాకు తెలియకుండానే ప్రదర్శించగలుగు తున్నాను. నా నటనా సామర్థ్యం చూసి నాకు నేనే తరచూ ఆశ్చర్య పోతుంటాను.

అసలు ఈ నటన నాకు పెళ్ళి అయిన తరవాత అబ్బిందనిపిస్తుంది.

సరోజిని మీద అసలు నాకు ఏ ఆకర్షణా లేదు' ఆమె అంటే నాకు చచ్చే ప్రేమ అంతకంటే లేదు. అయినా ఆమె లేకుండా నేను బతకలేనని, ఆమెతోనే నాకు జీవితం అనే అర్థం వచ్చేలా ప్రతి రోజు నటిస్తూ ఆమెతో నాలుగు సంవత్సరాలుగా జీవితం గడుపుతున్నాను.

సరోజినితో నా పెళ్ళి కాకముందు మాలతి నాకు తారసపడి ఉంటే జీవితంలో ఇలా నటించే అగత్యం ఉండేది కాదు.

భగవంతుడు నిజంగా చాలా కఠిన హృదయం కలవాడనిపిస్తుంది ఒక్కోసారి.

కాకపోతే ఏమిటి. "ఇష్టం లేని స్త్రీని పెళ్ళి చేసుకుని నువ్వు హాయిగా జీవిస్తున్నట్టు ఆమె ముందు నటించు" అని నన్ను శపించాడా అని పిస్తుంది.

ఏది ఏమైనా నాకు ఈ జన్మకి శాప విమోచనం కలగదు.

"కనీసం పై జన్మలోనైనా నాకో సన్నటి భార్యను ప్రసాదించు స్వామీ" అని బార్‌లో కూర్చున్న ప్రతిసారీ మొదటి పెగ్గు తీసుకోబోయే ముందు అనుకుంటూ ఉంటాను.

"అయిందా గడ్డం" అంటూ వచ్చి ఖాళీ కప్పు తీసుకుని వెళ్ళిపోయింది సరోజిని, నా జవాబు కోసం ఎదురు చూడకుండానే.

మా ఆవిడ వంట లాగానే, అయిదు నిమిష లలో అయిపోయే గడ్డం ఆదివారం నాడు యాభై నిమిషాలు గడిచినా పూర్తి కాదు.

నా చాదస్తం కానీ, సరోజిని మరీ లావుగా ఉండదు. మాలతి లాంటి వాళ్ళతో పోలిస్తే కాస్త లావు అనిపిస్తుంది. కానీ మామూలుగా చూస్తే అలా అనిపించదు. సరోజిని లాంటి వాళ్ళు ప్రతి పది మందిలోనూ కనీసం అయిదుగురు అయినా ఉంటారు. అయినా ఆమెను లావు మనిషిగా వూహించుకొని నా మనసు మాలో "స్లిమ్ ఫింగర్" కోసం వెతుకుతూ ఉందంటే కేవలం అది నా బలహీనత. ఆ విషయం నాకు తెలుసు. అయినా ఆ బలహీనత నుంచి బయట పడలేక పోతున్నాను.

"బాయిలర్‌లో నీళ్ళు చల్లారి పోతున్నాయి. మీరు ఎంత త్వరగా స్నానానికి లేస్తే అంత మంచిది" అంది సరోజిని ఏదో వస్తువు కోసం వచ్చి దాన్ని తీసుకుని వెళుతూ.

అసలు సరోజినిని చేసుకోటానికి నేను ఎలా ఇష్టపడ్డానా అని పెళ్ళి అయిన తరువాత కొన్ని వందల సార్లు ప్రశ్నించుకున్నాను. నా ఇష్టాలేమిటో నాకు మొదటి నుంచీ తెలుసు. అయినా పెళ్ళి చూపుల నాడు నా ఇష్టాలను మరిచిపోయి ఆమె నచ్చిందని ఎలా చెప్పానా అని రోజూ ఆశ్చర్యపోతుంటాను.

ఈ పెళ్ళికి నన్ను ఎవరూ బలవంత పెట్టలేదు. ఆమెను చేసుకోటం ఇష్టం అవునో కాదో తేల్చుకోటానికి మా పెద్దవాళ్ళు నాకు పూర్తి అవకాశం ఇచ్చారు. అయినా నేను ఇంత తెలివి తక్కువ నిర్ణయం ఎలా తీసుకున్నానో ఇప్పటికీ అంతు పట్టటం లేదు.

సరోజిని తండ్రి నాకు పెద్ద కట్నం ఇచ్చాడు. బహుశా ఆ "కట్నం" అనే మాయలో చిక్కుకుపోయి ఆ సమయంలో మరో విషయం ఆలోచించలేకపోయానను కుంటాను.

ఏది ఏమైనా ఇప్పుడు నేను చేయగలిగింది ఏమీ లేదు. మౌనంగా ఆమెను భరిస్తూ వస్తున్నాను.

పెళ్ళి అయిన కొత్తలో ఆమెకు విడాకులు ఇవ్వాలనుకుంటూ ఉండేవాడిని. కానీ ఆ విషయంలో నేనో నిర్ణయానికి వచ్చేలోగా మా చంటిగాడు పుట్టాడు. వాడి రాకతో ఆ ఆలోచనకి మరి తావు లేకపోయింది. కానీ ఎలాగైనా సరోజిని నుంచి విడిపోయి మరో నచ్చిన లేడీని పెళ్ళి చేసుకుంటేకానీ ఈ జన్మకి శాంతి లేదు అనిపిస్తూ ఉంటుంది. "ఏదైనా జబ్బు చేసి సరోజిని చనిపోతే బాగుండును" అని చాలా అమానుషంగా ఒక్కోసారి ఆలోచిస్తూ ఉంటాను.

అయితే తన పట్ల నా మనసులో ఇంత దారుణమైన ఆలోచనలున్నాయని సరోజినికి తెలియదు. ఎవరైనా ఆ విషయం చెప్పినా నమ్మదు. ఒక వేళ నమ్మవలసి వస్తే మరు క్షణం గుండె ఆగి చనిపోతుంది. లేదా ఆత్మహత్య అయినా చేసుకుంటుంది.

దానికి నా మీద ఉన్న గురి అలాంటిది. మొగుడ్ని పిచ్చిగా ప్రేమిస్తుంది. నాకు సర్వ సపర్యలూ చేస్తుంది. నాకు సేవ చేయటంలో తాను ఆనందం పొందుతుంది. పతి సేవలోనే పరమ సుఖం ఉందన్న విషయం జీర్ణించుకుని నన్ను కంటికి రెప్పలా కాపాడు కుంటుంది.

వంట, తిండే కాకుండా నేను ఆఫీసుకు వెళ్ళే ముందు కావలసిన సర్వ అవసరాలూ స్వయంగా క్రమం తప్పకుండా చూస్తుంది. కాగితం నుంచి కలం దాకా, బనియన్ నుంచి బూటు వరకూ అన్నీ సిద్ధం చేసి ఉంచుతుంది.

నాకు కాస్త తల నొప్పి వచ్చినా విలవిలలాడి పోతుంది. ఆఫీసు నుంచి రావటం ఆలస్యమయితే మహా ఖంగారు పడుతుంది. తను ఖంగారు పడుతుందని "ఆలస్యంగా ఇంటికి వస్తాను" అని ముందే చెబుతూ ఉంటాను. అయినా నేను తిరిగి వచ్చే వరకూ తను అన్నం తినకుండా నాకోసం ఎదురు చూస్తూ ఉంటుంది.

ఎంత చదువుకున్నా సరోజినికి కొన్ని సనాతన భావాలున్నాయి. పండగ, పబ్బం వస్తే దేముడి పటం పక్కన నన్ను కూడా నిలబెట్టి నా చేత అక్షింతలు వేయించుకుంటుంది.

అలాంటి సమయాల్లో నా భార్య మీద నాకు అంతులేని ప్రేమ పుట్టుకొస్తుంది.

ఆమెను అలాగే పైకి లేవదీసి, నా హృదయానికి హత్తుకుని, "దేవీ! నా మీద నీకెందుకింత ప్రేమ" అని అడిగాను ఒకసారి.

"ఎందుకేమిటి? ఎవరి మొగుడ్ని వాళ్ళు ప్రేమించరా ఏమిటి?" అంది.

పెళ్ళాలు అందరూ మొగుడ్ని ఇంతగా ప్రేమించరని నాకు తెలుసు.


సరోజిని నిర్మలమైన ప్రేమలో కరిగిపోయి— "సరూ! ఇంతవరకూ నేను నీకు ఏమీ ఇవ్వలేదు. ఏమైనా కోరుకో!" అన్నాను.

"ఇంకా ఏం కావాలి. మీరు నన్ను ఇంత మంచిగా చూసుకుంటున్నారు. నాకు వేరే ఏ కోరికలూ లేవు. మీకు జీవితాంతం సేవ చేస్తూ మీతోనే ఇలా గడపాలని ఉంది" అంది సరోజిని.

"ఇలాంటి అమాయకురాలినా నేను వంచిస్తున్నది. నేను చాలా పాపాత్ముడిని. నా పాపానికి నిష్కృతి లేదు. నా భార్యని నేను మోసగిస్తున్నందుకు ఎవరైనా నాకు కొరడా దెబ్బలు విధిస్తే బాగుండును అనిపిస్తుంది. తిన్నగా పోలీస్ స్టేషనుకు వెళ్ళి నా నేరం ఒప్పుకుని జీవితాంతం వరకు జైలు శిక్ష అనుభవించాలనిపిస్తుంది."

కానీ అదంతా ఒక్క క్షణం మాత్రమే. మరు క్షణం నేను మామూలు మనిషిని అయిపోతాను.

"పక్కింటి పిన్ని గారు ఇల్లు ఖాళీ చేస్తారట" అంది సరోజిని జుట్టు చేత్తో సవరించుకుంటూ వచ్చి.



వంట పనిలో మంచి తెలివి సట్లుంది. వచ్చి నా పక్కన మరో కుర్చీలో కూర్చుంది. నా గడ్డానికి ఇంకా సబ్బు నురుగు ఉంది. గడ్డం మొదలు పెట్టి అరగంట దాటింది. ఇంతవరకూ సగం కూడా కాలేదు.

"ఎందుకుట" అన్నాను అద్దంలో చూసుకుంటూ.

"వాళ్ళ అబ్బాయికి ఆఫీసు దూరం అయిందట. అందుకని చిక్కడపల్లి వెళ్ళిపోతున్నారు" అంది సరోజిని.

"అతను పని చేసేది చార్మినార్ దగ్గర కదా. చిక్కడపల్లికి వెడితే ఆఫీసు ఇక్కడి కంటే దగ్గర ఎలా అవుతుంది."

"అసలు కారణం అది కాదులెండి. ఇంటి అద్దె పెంచుతానని వోనరు అన్నాడట. ఎక్కువ అద్దె పెట్టడం ఇష్టం లేక వెళ్ళిపోతున్నారని నా ఉద్దేశ్యం."

గవర్నమెంటువాళ్ళు ఉద్యోగులకి యాన్యువల్ ఇంక్రిమెంట్లు ఇచ్చినట్లుగా, మా వోనరు ప్రతి సంవత్సరం ఇంటి అద్దె పెంచుతూ ఉంటాడు. అద్దె పెంచిన ప్రతిసారీ ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోతుంటారు. కొత్త వాళ్ళు వస్తూ ఉంటారు. కానీ మేము మాత్రం గత నాలుగేళ్ళుగా అద్దె పెంచినా ఆ ఇంటినే అంటిపెట్టుకుని ఉన్నాం. ఈ ఇల్లు నాకు ఆఫీసుకు అందుబాటులో ఉంది. ఇతరత్రా కూడా సౌకర్యంగా ఉంది.

అయితే పక్క పోర్షను వాళ్ళు కాళీ చేయబోయే ముందు, అందులోకి కొత్తగా రాబోయే ఫామిలిలో కనీసం ఒక్క "స్లిమ్ ఫిగర్" అయినా ఉండాలని ఆశపడుతూ ఉంటాను. కానీ నా ఆశ ప్రతిసారీ అడియాస అవుతూంది.

తెల్లవారింది—మళ్ళీ ఆఫీసు.

ఒక గంటసేపు ఏవో కాగితాలు తిరగేశాను. పనిలో ఏకాగ్రత కుదరటం లేదు. ఒకసారి మాలతిని చూసివస్తేగానీ పనిలో 'కాన్సన్ట్రేట్' చెయ్యలేను. అలా అలవాటు అయిపోయింది.

లేచి సి సెక్షను వైపు దారి తీశాను.

సుందరం సీటులో లేడు. అసలు ఆఫీసుకు వచ్చాడో లేదో తెలియదు.

మాలతి కుర్చీలో కూర్చుని తన పని చేసుకుంటూంది. అంత పెద్ద కుర్చీలో సన్నగా ఉన్న మాలతి కూర్చోగా ఇంకా సగం ఖాళీగా ఉంది. ఆ కాళీలో తన పక్కన నన్ను కూర్చోపెట్టుకోకూడదూ అనిపించింది కాసేపు.

"దటీస్ ఇంపాసిబుల్" అంటూ నా మనసు నన్ను హెచ్చరించింది.

సుందరం లేడు కాబట్టి నేను వెంటనే వెను తిరగాలి. కానీ నా కది ఇష్టం లేదు.

"గుడ్ మార్నింగ్ మేడమ్!" అన్నాను మాలతిని ఉద్దేశించి.

తల పైకెత్తి "వెరీ గుడ్‌మార్నింగ్" అంది పల్చటి పెదవులతో మందహాసం చేస్తూ.

నా జన్మ ధన్యం అయిందనుకున్నాను.

"సుందరం రాలేదాండీ" అన్నాను.

"రాలేదండీ. వూరు వెళ్తున్నట్లుగా రాసి లీవు లెటరు ఎవరిచేతనో పంపించారు" అంది.

"అదేమిటి—మొన్న శనివారం నాడు నాతో వూరు వెళ్తున్నట్లు చెప్పలేదే. కారణం ఏమై ఉంటుందో మీకు తెలుసా?"

"తెలియదండీ—ఈ రోజున లీవు లెటరు చూసిం తరవాతే అతను వూరు వెళ్ళినట్లు తెలిసింది" అంది మాలతి తను చూస్తున్న ఫైలు మీంచి దృష్టి మరల్చకుండానే.

ఇంకా ఎక్కువసేపు ఉంటే బాగుండదని తిరిగి నా సీటుకి వచ్చేశాను.

సుందరం లేడు కాబట్టి ఇవాళ ఇంకొకసారి సి సెక్షనుకు వెళ్ళటం వీలుపడదు. అంతే కాదు, అతను తిరిగి వచ్చే వరకూ నే నటు వెళ్ళటం భావ్యం కాదు.

చెప్పాపెట్టకుండా లీవు పెట్టినందుకు అతని మీద నాకు క్షణం సేపు వళ్ళు మండిపోయింది. బహుశా వాళ్ళ ఆఫీసరుకు కూడా ఇంత కోపం వచ్చి ఉండదు.

రెండు రోజులు గడిచిపోయాయి.

సుందరం ఇంకా వూరునుంచి తిరిగి రాలేదు. ఎప్పుడు వస్తాడో కూడా తెలియదు. ఈ రెండు రోజుల నుంచీ మాలతి దర్శనం చేసుకోడానికి వీలుపడలేదు.

మాలతి సెక్షన్ మా ఆఫీసులో రెండవ అంతస్థులో ఉంది. నా సీటు గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉంది. ఏ పనీ లేకుండా రెండవ అంతస్తుకి వెళ్ళితే బాగుండదు. పోనీ ఆమె లంచ్ టైములో కిందికి దిగుతుందా అంటే అదీ లేదు.

అయిదు అయిపోగానే, మెట్లు దిగి తిన్నగా బస్ స్టాప్ చేరుకుని సిద్ధంగా ఉన్న బస్సు ఎక్కుతుంది. అది మరో అయిదు నిమిషాలలో బయలుదేరి వెళ్ళిపోతుంది. ఈ కాస్త సమయంలో తెరమీద బొమ్మలా క్షణంసేపు లాంగ్ షాట్‌లో మాలతి కనబడుతుంది. ఆ ఒక్కక్షణం కోసం కొన్నివేల క్షణాలు లెక్కపెడుతూ రోజంతా కాలం గడపాలి.

సరోజిని చెపినట్లుగా పక్కింటి పిన్ని గారు ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోయారు. లయితే వెంటనే మరో ఫామిలీ దిగలేదు. ఇల్లు ఇంకా ఖాళీగానే ఉంది. బయట "టు లెట్" బోర్డు వేలాడుతూంది.

బోర్డు చూసిం తర్వాత నా కో ఐడియా వచ్చింది.

మాలతికి ఈ ఇల్లు ఇప్పించితే? అబ్బో! ఇంకేమైనా ఉందా. రోజూ పండుగే. రోజుకి కొన్ని వందల సార్లు ఆమె దర్శనం చేసుకో వచ్చు. నెమ్మదిగా సరోజినిని ఆమెతో స్నేహం చేయించి, ఆమెను మా ఫామిలీ ఫ్రెండ్‌గా చేసుకోవచ్చు అనిపించింది.

ఈ ఆలోచన రాగానే నా మనసు గాలిలో తేలిపోయింది. ఆలోచనా మాత్రంగానే ఇంత ఆనందంగా ఉందే, ఆమె నిజంగా మా ప్రక్క ఇంటిలో మకాం పెడితే ఇంకెంత థ్రిల్లింగ్‌గా ఉంటుందోగదా. నాకు తెలియకుండానే నేను ఈలపాట వెయ్యటం మొదలు పెట్టాను. చెప్పలేని ఆనందంతో మనసు దూది పింజలా గాలిలో ఎగురుతూంది.

కానీ మరుక్షణం నా మనసు క్రిందికి దిగి వచ్చింది.

అసలు మాలతికి ఇల్లు అవసరం ఉందో లేదో? ఉన్నా ఆమెను ఇక్కడకు రమ్మని చెప్పే చనువులేదు. ఎలా? అంతలోనే కొంప మునిగినట్లుగా మనసునిండా దిగులు పేరుకుపోయింది.


ఇలా కాదు, ఏదైనా పథకం వెయ్యాలనుకున్నాను.


ముందు మాలతి పరిస్థితి ఏమిటో తెలుసుకుంటే ఆమెను ఆ ఇల్లు ఖాళీచేసి మా ప్రక్క పోర్షనుకు రమ్మనవచ్చు. "ఆఫీసుకు దగ్గరగా ఉంటుంది. ఇల్లు మారండి" అని, అవసరం అయితే సుందరంలో ఆమెకు చెప్పించవచ్చు అని ఆలోచించాను.

ఆఫీసు అయిపోగానే మాలతి ఎక్కిన బస్సులో ఆమె గమనించకుండా నేను కూడా ఎక్కాను. బస్సు టెర్మినస్ వరకూ టికెట్టు తీసుకున్నాను.

ఆమె విద్యానగర్‌లో దిగింది.

ఆమెకు తెలియకుండా నేను ఆమెను అనుసరి






స్తున్నాను.

రెండు నిమిషాలు నడిచి, ఆమె ఒక పెద్ద ఇంటి లోకి వెళ్ళింది.

తరవాత ఏం చెయ్యాలో నాకు అంతు పట్టలేదు. ఇంతలో ఆ ఇంటికి ఒక వంద గజాల దూరంలో ఒక హోటలు కనపడింది. చకచకా హోటలుకు వెళ్ళి అనువైన టేబిలు ముందు కూర్చున్నాను.

ఇప్పుడు మాలతి ఇల్లు స్పష్టంగా కనబడుతూంది.

టీ తెప్పించుకుని తాగుతూ ఆ ఇంటిని స్టడీ చేస్తున్నాను.

ఒక పెద్ద ఇంటిలో అది రెండు గదుల పోర్షను. గుమ్మం వీధిలోకే ఉంది. చుట్టూ కాంపౌండు గోడ లేకపోవటంతో ఇంట్లో మనుషులు తిరుగుతూ కనబడుతున్నారు.

మాలతి కాక మరో ఇద్దరు వృద్ధ దంపతు లున్నారు. తల్లీ, తండ్రీ అయి ఉంటారు. మరో పదహారు ఏళ్ళ కుర్రవాడు కనబడుతున్నాడు. అతను మాలతికి తమ్ముడు అయి ఉండాలి. ఈ హోటలులో కూర్చుని అంతకంటే ఎక్కువగా తెలుసుకునే అవ కాశం లేదు. నెమ్మదిగా సుందరం ద్వారా ఆమెను గురించి ఆరా తీయవచ్చు అనిపించింది.

నేనేదో పిచ్చి పిచ్చిగా ఆలోచిస్తున్నాను గానీ, అసలు మాలతి ఇల్లు ఎందుకు మారుతుంది—అన్న సందేహం వచ్చింది. ఈ ఇల్లు మాలతికి అనువుగానే ఉన్నట్టుంది. అంతలో మనసు గందరగోళంగా తయారు అయింది. ఏదో ఒకటి చెయ్యవచ్చులే అనుకుంటూ, విద్యా నగర్‌లో లోకల్ ట్రైన్ ఎక్కి ఇల్లు చేరుకున్నాను.

మరో రెండు రోజుల తరవాత గానీ సుందరం వూరునుంచి తిరిగి రాలేదు.

సెక్షనులో అయితే మాలతి మా మాటలు వింటుందని లంచ్ టైములో సుందరాన్ని కాంటీనుకు తీసుకు వెళ్ళాను.

"అది సరే! చెప్పాపెట్టకుండా నువ్వు వూరువెళ్ళే సరికి అక్కడ మీ వాళ్ళకి ఏమైనా అయిందేమో, నని మహా కంగారు పడ్డాను" అన్నాను గొప్ప నాటకీయంగా.

నా నటనా శక్తి సుందరం ముందు ప్రదర్శించటం ఇదే మొదటిసారి.

"సారీ గురువుగారూ. మీతో చెప్పే అవకాశం లేకపోయింది. ఆ రోజు ఆదివారం నాడు అర్జంటుగా రమ్మనమని మా ఫాదరు పంపిన కబురు అందింది. వెంటనే వెళ్ళిపోయాను" అన్నాడు నాతో చెప్పకుండా వెళ్ళినందుకు బాధ పడుతూ, తన గురించి నేను బాధ పడ్డందుకుగాను కృతజ్ఞతాభావం కనపరుస్తూ.

"అంతా బాగున్నారు కదా" అన్నాను ఎంతో ఆందోళన చెందుతున్నట్లుగా.

"నువ్వు ఏం కంగారు పడకు. అంతా కులాసాగానే ఉన్నారు."

"మరి అర్జంటు ప్రయాణం ఎందుకో?"

"మా వూళ్ళో కొంచెం పొలం ఉంది. దాన్ని అమ్మి మా ఫాదరును ఇక్కడికి తీసుకు రావాలను కుంటున్నాను. ఆ వూళ్ళో ఎవరూ కావలసిన వారు లేరు. ఆయన ఒక్కడూ అక్కడ ఎందుకు అని ఆ పొలం అమ్మకం పెట్టాము. ఏదో బేరం వచ్చింది. ఆ విషయం తేల్చుకునేందుకు వెళ్ళాను."

"అయితే బేరం సెటిల్ అయిందా?"

"దాదాపు అయిపోయినట్టే. పొలం రిజిస్ట్రేషన్ అయిపోగానే మా నాన్నగారు ఇక్కడికి వస్తారు."

"అలాగా. చాలా సంతోషం" అన్నాను నేను.

సుందరం తల్లి చనిపోయింది. ఒక చెల్లెలు ఉంటే పెళ్ళి అయి అత్తారింటికి వెళ్ళింది. ఈ విషయాలు గతంలో అతను నాకు చెప్పాడు.

అయితే అతని తండ్రి ఇక్కడికి వస్తే ఇద్దరికీ చెయ్యటానికి ఆడ దిక్కు కావాలిగదా. ఎలాగో మరి? పనిలో పనిగా సుందరం పెళ్ళి సంబంధాలు చూసి ఉండవచ్చు అనుకున్నాను.

అంతేకాదు, సుందరం మాలతిని పెళ్ళి చేసుకుంటే, వాళ్ళకి మా పక్క పోర్షను ఇప్పించవచ్చు. నా ఆశయంకూడా నెరవేరుతుందని అనిపించింది.

"పనిలో పనిగా పెళ్ళి చూపులు చూసి వచ్చావా" అన్నాను గుంభనగా.

"అదేం లేదు గురూ" అన్నాడు వెంటనే నేనేదో చెయ్యరాని పని చేశావా అన్నట్టుగా.

"ఇంకా ఎంత కాలం ఇలా ఒంటరి జీవితం గడుపుతావు. నువ్వంటే హోటళ్ళ పట్టుకు తిరుగుతున్నావు. రేపు మీ ఫాదరు వస్తే పాపం ఆ ముసలాయనకు ఇంత వండి పెట్టేవారు కావాలి కదా" అన్నాను నే నేదో పెద్ద శ్రేయోభిలాషిలా.

"నిజమే గురువుగారూ. నాకు నచ్చిన అమ్మాయి దొరికితే పెళ్ళి చేసుకుందా మనుకుంటున్నాను" అన్నాడు మరో వైపు చూస్తూ.

పెళ్ళి విషయం మాట్లాడటానికి సిగ్గు పడు తున్నా డనిపించింది. నాటకంలో మరో డైలాగు వెయ్యటానికి మంచి ఛాన్స్ దొరికింది.

"మీ సెక్షనులో పని చేసే మాలతి నీకు నచ్చితే వాళ్ళ పెద్దవాళ్ళతో మాట్లాడతాను" అన్నాను.

సుందరం చివాలున తీక్షణ్ణంగా నా వంక చూశాడు. ముఖంలో కోపం స్పష్టంగా కనపడుతూంది. నే నేమన్నా తప్పు మాట అన్నానా అని తర్కించుకున్నాను. కానీ నా మాటల్లో తప్పేమీ నాకు స్ఫురించ లేదు.

నేను ఒక నిమిషం మౌనంగా వూరుకున్నాను.

కాసేపటికి సుందరం మామూలు మనిషి అయ్యాడు.

"నీకు ఈ విషయం తెలియదా? లేక తెలిసికూడా నన్ను హేళన చేస్తున్నావా" అన్నాడు అతి సాధారణంగా.

అసలు విషయం ఏమిటో అంతు బట్టలేదు.

"నీ మనసు కష్ట పెట్టి ఉంటే క్షమించు. కానీ నువ్వు ఏ విషయం గురించి అంటున్నావో తెలియదు" అన్నాను.

నేను గొప్పగా నడిపిస్తున్నాననుకున్న నాటకం ఫెయిలు అయిపోతుందేమో ననిపించింది. ఒక రకంగా నా మూడ్ ఆవ్ అయిపోయింది.

"మన ఆఫీసులో అందరికీ తెలిసిన విషయం నీకు తెలియదంటే నమ్మమంటావా?"

"అసలు విషయం ఏమిటో చెప్పకుండా నన్ను విల దీస్తున్నావు" అన్నాను నేను.

"మాలతి పూర్వాశ్రమంలో నా భార్య" అన్నాడు గంభీరంగా.


నేను కొయ్యబారి పోయాను. నేను ఏం వింటున్నానో నాకే అర్థం కానంతగా నా మెదడు మొద్దుబారి పోయింది.

"నిజం గురూ! నేను ఆమెకు విడాకులు ఇచ్చి మూడేళ్ళు దాటింది" అన్నాడు సుందరం.

"నాకు నమ్మకం కలగడం లేదు" అన్నాను అయోమయంగా అతని ముఖంలోకి చూస్తూ.

"నువ్వు నమ్ము నమ్మకపో, ఇది పచ్చి నిజం. అంతే కాక మన ఆఫీసులో ప్రతి ఒక్కరికీ తెలిసిన నగ్న సత్యం ఇది."

నేను ఈ ఆఫీసులో చేరి రెండేళ్ళయింది. ఈ కథంతా అంతకుముందు జరిగింది. అందుకే నాకు తెలియదు. నాకు తెలియకపోవటం నా తప్పు




నాకు అంతకే వినిపించాను. నా కథనంతో అతను తృప్తి చెందాడు..

"ఇది ఎలా జరిగింది. దీన్ని గురించి ఎవరినో అడిగేకంటే నీ నుంచే వినటం మంచిది. నీకు అభ్యంతరం లేకపోతే చెప్పు. నేను నీ శ్రేయోభిలాషిని" అన్నాను.

నేను ఇంకా మామూలు మనిషిని కాలేదు.

"ఏది మందీ ఏది రకాలుగా అనుకుంటూ ఉంటారు. కానీ వారు చెప్పే కథంతో నిమిత్తం లేకుండ నేను చెప్పిందే అక్షరాలా నిజం అని నువ్వు నమ్మాలి" అన్నాడు సాక్షం కోర్టులో సంజాయిషీ ఇస్తున్న ముద్దాయిలా.

"నీ మీద నమ్మకం లేక పోటం ఏమిటి. నీ మాటల మీద నమ్మకమున్న వారిలో నేను మొదటి వాడిని" అన్నాను.

"నేను, మాలతీ గత అయిదేళ్ళుగా ఈ సి. సెక్షన్‌లో పని చేస్తున్నాము. మొదట్లో ఆమె చాలా అందంగా ఉండేది. ఆమె అందం చూసి మోజుపడి మా వాళ్ళకి ఇష్టం లేకపోయినా, నాకు వేరే సంబంధం ఉన్నా వదులుకుని మాలతిని పెళ్ళి చేసుకున్నాను."

"ఆమె ఇప్పటికీ అందంగానే ఉంది కదా" అన్నాను ఎంతో ఆత్రతగా.

నవ్వొస్తున్న భరించలేకపోతున్నాను.

"నా పెళ్ళికి ముందు మాలతి చాలా బొద్దుగా లావుగా ఉండేది. లావుగా నిండుగా గుమ్మడి పండులా ఉండే స్త్రీ అంటే నాకు చాలా ఇష్టం. ఆమె శరీర సౌష్టవం చూసి ఆమెను కావాలని పెళ్ళి చేసుకున్నాను. కానీ దురదృష్టవశాత్తూ పెళ్ళి అయిన కొద్ది రోజులకే ఆమె సన్నబడి పోయింది.

ఆమె సన్నబడుతున్నకొద్దీ ఆమె పై నాకు ఆకర్షణ తగ్గి పోతూ ఉండేది. కొన్నాళ్ళకి ఆమె పూర్తిగా సన్నబడి పోయింది.

సన్నగా ఎండుకట్టెలా ఉండే బక్క ప్రాణాలంటే నాకు చెడ్డ అసహ్యం. ఇదొక మానసిక బలహీనత. మాలతిపై కొన్నాళ్ళకి నాకు ఆకర్షణ పూర్తిగా నశించి పోయింది.

నేను అనుకున్నది ఒకటి అయితే, జరిగింది మరొకటి. వివాహ జీవితంలో నాకు కలిగిన ఈ ఆశాభంగం, క్రమంగా ఆమెపై ద్వేషంగా మారింది.

ఆమె తిరిగి లావు కావడానికి, అనేక మందులు పద్ధతులు అవలంభించాము. అయినా ఫలితం లేక పోయింది.

ఆమెతో ఇక సంసారం చేయలేననిపించింది. అంతే! ఒక రోజున విడాకుల ప్రతిపాదన తీసుకు వచ్చాను. అందుకు ఆమె ప్రతిఘటించలేదు. ఇష్టం లేని స్త్రీతో సంసారం చెయ్యటం ఎవరూ అనరు. ఆ మాట నేనా అనను—అంటూ నిర్వికారంగా విడాకుల పత్రం మీద సంతకం పెట్టింది.

ఆఫీసులో ఒకే చోట పని చేస్తున్నా, అప్పటి నుంచీ ఆమెకు, నాకూ మాటలు లేవు" అన్నాడు సుందరం.

అతని కథ విన్న తరవాత అతని మీద నాకు జాలి కలగలేదు. మొదటిసారిగా అతని మీద అసహ్యం కలిగింది.

ఒకసారి అతని వంక ఎగా దిగా చూశాను. మనిషి నిలువెత్తున కంచు విగ్రహంలా ఉన్నాడు. ఎంతో ఆరోగ్యంగా, అందంగా ఉన్నాడు. అయితేనేం?

"బంగారం లాంటి ఆమె జీవితం సర్వ నాశనం చేశాడు దుష్టపోతు" అనుకున్నాను.

మనసు వికలం అయిపోయింది. పువ్వులా ఉన్న ఆమె అందం వెనక ఇంత చీకటి ఉందని వూహించ లేకపోయాను. ఆమెను చీకటిలోకి నెట్టిందికూడా ఈ సుందరమే అంటే ఇప్పటికీ నమ్మకం కుదరటం లేదు.

ఒక రకంగా నేనూ సుందరం లాంటి దున్న పోతునే. పోతే అతను ఇంకొక అడుగు ముందుకు వేశాడు. అంతే.

ఇంకా నయం. నా పిచ్చి కోరికలతో నా సంసారానికి నేను ఏ అన్యాయం తలపెట్ట లేదు. మాలతికి ఉద్యోగం ఉంది కాబట్టి ఎలాగో కాలం గడుపుతూంది. అదే పరిస్థితి సరోజినికి కలిగితే ఏమై పోయేదో.

ఆలోచిస్తుంటే నాపై నాకే అసహ్యం వేసింది. ఇంత కాలం నేనెంత మూర్ఖంగా ప్రవర్తించానో, దేవత లాంటి నా భార్యని ఎంతగా వంచించానో మనసులో మెదులుతుంటే నా పాపానికి ప్రాయశ్చిత్తం లేదు అనిపించింది.

మనసు మనసులో లేక ఇంటికి వెళ్ళ బుద్ధి కాలేదు.

రాత్రి తొమ్మిది గంటల వరకూ పిచ్చి పిచ్చిగా ఆలోచిస్తూ రోడ్ల మీద తిరిగి ఆలస్యంగా ఇంటికి చేరుకున్నాను. నా భార్యకు ఎలా మొహం చూపించాలా అని మథన పడుతున్నాను.

తలుపు తట్టేసరికి నిద్ర కళ్ళతో తలుపు తీసింది సరోజిని. నేను నా ఇంటిలోనే దొంగలా ప్రవేశించాను.

నా మానసిక స్థితిని గమనించలేని నిద్ర మత్తులో ఉంది సరోజిని.

"వచ్చారా" అంటూ నా మెడని కావిలించు కుంటూ నా హృదయంపై వాలిపోయింది.

పశ్చాత్తాపంతో నేను నిలువునా దహించుకు పోతున్నాను. దేవత లాంటి సరోజినిని కాపాడుకో గలిగినందుకు ఆనందం కలిగింది.

పశ్చాత్తాపం, దుఃఖం, ఆనందం అన్నీ కలిసిన మానసిక స్థితిలో నా కళ్ళ నుంచి నీళ్ళు టపటప మని కారి ఆమె వీపు మీద పడ్డాయి.

వేడి కన్నీళ్ళ స్పర్శకి ఆమె నిద్ర మత్తు వదిలి పోయింది. నా కళ్ళలో నీళ్ళు చూసి కంగారు పడింది.

"ఏమండీ, ఏమిటిది? ఏమైంది?" అంటూ ఆమె ఆరాట పడిపోయింది.

"ఏమీ లేదు. నీ మీద బెంగ పుట్టింది. నువ్వు లేకుండా బతకలేను సరూ" అంటూ పిచ్చి పిచ్చిగా మాట్లాడాను.

ఆమెకు కూడా క్షణంలో కన్నీళ్ళు పొంగుకుని వచ్చాయి. ఆమె కన్నీళ్ళు చూసి నేను తేరుకుని ఆమెను ఓదార్చాను.

నేను స్నానం చేసి వచ్చేసరికి ఆమె టేబుల్ మీద పళ్ళాలు పరిచింది.

"ఇవాళ రెండు పళ్ళాలు వద్దు. ఇద్దరం ఒక దాంట్లోనే తిందాం" అన్నాను నేను.

ఒకరికి ఒకరం తినిపించుకుంటూ గంట సేపు భోజనం చేశాం.

ఎంత ఆపుకున్నా ఆ రాత్రి అంతా నాకు ఆగ కుండా కన్నీళ్ళు కారుతూనే ఉన్నాయి.

"మాలతిని, సుందరాన్ని ఎలాగైనా ఒకటి చెయ్యాలి. వాళ్ళ జీవితం నిలబెట్టాలి. అవసరం అయితే సరోజిని సహాయం తీసుకోవాలి" అని నిశ్చయించుకున్నాను. ✱